
సాక్షి పల్నాడు

బుధవారం । 24 । ఏప్రిల్ । 2024



వైభవంగా హనుమజ్జయంతి

గుంటూరుఎడ్యుకేషన్: హనుమజ్జయంతిని పురస్కరించుకుని మంగళవారం కొత్తపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో 41 రోజుల మండల దీక్షను ప్రారంభించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 506.40 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 3,597 క్యూసెక్కులు విడుదలవుతోంది.



భక్తిశ్రద్ధలతో గణపతి, చండీహోమం

గుంటూరుఎడ్యుకేషన్: బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా గణపతి, చండీహోమాన్ని నిర్వహించారు.







ప్రచార పర్వం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు అనంతరం అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. దీంతో వారి సతీమణులు ప్రచారపర్వంలో పాల్గొంటున్నారు. మంగళవారం సత్తెనపల్లి పట్టణంలోని ఎనిమిదో వార్డులో మంత్రి అంబటి రాంబాబు సతీమణి విజయలక్ష్మి ప్రచారంలో భాగంగా పునుగులు వేసి ఓటర్లను ఆకర్షించారు. మాచర్ల పట్టణంలోని 19వ వార్డులో ఎమ్మెల్యే పీఆర్కే సతీమణి రమాదేవి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు మండలం అనంతవరంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి ప్రచారం నిర్వహించారు. ఆమెకు ప్రజలు సాదరస్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

నేడు అనిల్, గోపిరెడ్డి నామినేషన్

- రెడ్డినగర్ నుంచి ర్యాలీ ప్రారంభం
- ఏర్పాట్లు చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు



నరసరావుపేట: నరసరావుపేట పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న డాక్టర్ పి.అనీల్‌కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు బుధవారం నామినేషన్లు వేయనున్నారు. సర్వమత ప్రార్థనల్లో భాగంగా తొలుత గుంటూరు రోడ్డు నాయబ్‌బజారు పెద్దమసీదు, స్టేషన్ రోడ్డులోని బాప్టిస్టు టౌన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో అభ్యర్థులు పాల్గొంటారు. అనంతరం ఉదయం తొమ్మిది గంటలకు రెడ్డినగర్‌లోని అభయాంజనేయస్వామి దేవాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడి నుంచి వేలాదిమందితో ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకొని నామినేషన్ దాఖలు చేస్తారు. అక్కడి నుంచి ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనీల్ కలెక్టరేట్‌కు వెళ్లి తన నామినేషన్ దాఖలు చేస్తారు. ర్యాలీకి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని అభ్యర్థులు పిలుపు ఇచ్చారు. అభ్యర్థులకు మద్దతుగా ఆర్యవైశ్యులు శివునిబొమ్మ సెంటర్ నుంచి బైకులతో ర్యాలీలో పాల్గొనాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొత్తూరి కిషోర్‌బాబు కోరారు.

నేడు కాసు మహేష్‌రెడ్డి నామినేషన్

తరలిరావాలని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే



గురజాల: గురజాల అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్ సీపీఅభ్యర్థిగా కాసు మహేష్‌రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం కారంపూడి రోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మహేష్‌రెడ్డి పిలుపునిచ్చారు.

27న పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్ష



చిలకలూరిపేట టౌన్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్ ఎంట్రన్స్‌ను ఈనెల 27న నిర్వహించనున్నట్లు చిలకలూరిపేట పాలిసెట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.డేవిడ్‌రాజు తెలిపారు. పట్టణంలోని ఏఎంజీ జూనియర్ కాలేజీలో సోమవారం అన్ని పరీక్ష కేంద్రాల చీఫ్, జాయింట్ చీఫ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని తెలిపారు. పల్నాడు జిల్లాలో చిలకలూరిపేట, మాచర్ల పట్టణాల్లో పరీక్ష కేంద్రాల్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. చిలకలూరిపేట పట్టణంలో ఆరు కేంద్రాలలో సుమారు 2049 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. స్థానిక సీఆర్ డిగ్రీ కళాశాల (గణపవరం), ఏఎంజీ జూనియర్ కళాశాల, శ్రీ శారదా జెడ్పీహెచ్ స్కూల్, సెయింట్ చార్లెస్ హైస్కూల్, జీఆర్ జూనియర్ కాలేజీ (కాకతీయ స్కూల్ క్యాంపస్), మోడ్రన్ గ్రీన్ వ్యాలీ స్కూళ్లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడు చేసుకోవాలని సూచించారు. పల్నాడు జిల్లా పాలిసెట్ కోఆర్డినేటర్‌గా క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి. రమాదేవి, చిలకలూరిపేట కేంద్ర అసిస్టెంట్ కోఆర్డినేటర్‌గా సీఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీరాజ్యం వ్యవహరిస్తున్నట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులను ఉదయం 9.45 నుంచే లోపలకు అనుమతిస్తారని తెలిపారు. 11 గంటల తర్వాత అనుమతి లేదని స్పష్టం చేశారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6200, గరిష్ట ధర రూ.8400, మోడల్ ధర రూ.7100 వరకు పలికింది.

నరసరావుపేటలో స్థానికేతరులకే పట్టం

- 1998 నుంచి గెలుస్తున్న ఎంపీలు అందరూ జిల్లాయేతరులే
- గుంటూరు నుంచి వచ్చిన రోశయ్య, మోదుగుల, లావు శ్రీకృష్ణ
- నెల్లూరు నుంచి వచ్చిన నేదురుమల్లి, మేకపాటి
- ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున అనిల్‌కుమార్ యాదవ్ పోటీ
- నెల్లూరు సెంటిమెంట్, తొలి బీసీ అభ్యర్థి కావడంతో అనిల్ గెలుపు పక్కా అంటున్న రాజకీయ విశ్లేషకులు



మేకపాటి రాజమోహన్‌రెడ్డి



రాయపాటి సాంబశివరావు



కొణిజేటి రోశయ్య



నేదురుమల్లి జనార్ధనరెడ్డి

సాక్షి, నరసరావుపేట: ఎన్నికల్లో అభ్యర్థి స్థానికత అంశం ఎంతో కీలకం. కొన్నిసార్లు దాని ఆధారంగా గెలుపోటములు ప్రభావితమవుతుంటాయి. నరసరావుపేట ఓటర్లు 1998 పార్లమెంట్ ఎన్నికల నుంచి ఇప్పటివరకు పల్నాడు వెలుపలి వారికే పట్టం కడుతున్నారు. ప్రధాన పార్టీలు కూడా నాన్ లోకల్ అభ్యర్థులనే బరిలోకి దింపుతున్నాయి. 1998 ఎన్నికలలో ప్రస్తుత బాపట్ల జిల్లాలోని వేమూరులో జన్మించిన మాజీ సీఎం కొణిజేటి రోశయ్యను నరసరావుపేట పార్లమెంట్ ఓటర్లు గెలిపించారు. ఆ తరువాత 1999 ఎన్నికల్లో మరో మాజీ సీఎం నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి టీడీపీ అభ్యర్థి లాల్‌జాన్‌బాషాపై గెలుపొందారు. ఇదే లోకసభ నియోజకవర్గం నుంచి కాసు బ్రహ్మానందరెడ్డి ఎంపీగా గెలవడంతో ముగ్గురు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంలను ఢిల్లీకి పంపిన ఘనత నరసరావుపేటకి దక్కింది. నేదురుమల్లి తర్వాత 2004 సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు జిల్లాకు చెందిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఎంపీగా గెలుపొందారు. వీరు ముగ్గురు కాంగ్రెస్–ఐ పార్టీ తరఫున గెలుపొందారు. 2009లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసిన మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి గెలుపొందారు. మోదుగుల స్వస్థలం గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమి.



ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత జరిగిన 2014 ఎన్నికల్లో రాయపాటి సాంబశివరావు మాత్రం అమరావతి మండలం ఉంగుటూరు గ్రామానికి చెందినవారు. 2019లో జరిగిన చివరి సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు జిల్లా పెదనందిపాడుకు చెందిన లావు శ్రీకృష్ణదేవరాయులు వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసి గెలిచారు. ఇలా గత ఆరు ఎన్నికల్లో ఐదుమంది పల్నాడు ప్రాంతానికి చెందనివారు ఎంపీగా గెలుస్తున్నారు.

అనిల్‌కుమార్ యాదవ్‌కు బ్రహ్మరథం



బీసీల అడ్డా అయిన నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో ఇంతవరకు ఒక్క బీసీ అభ్యర్థి కూడా ఎంపీగా గెలుపొందలేదు. బీసీలను రాజకీయంగా ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ వర్గానికి చెందిన పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను పోటీలో ఉంచిన విషయం తెలిసిందే. ఇప్పటికే అన్ని వర్గాల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. దీంతో ఆయన గెలుపు పక్కా అనే టాక్ వినిపిస్తోంది.

నెల్లూరు సెంటిమెంట్

రాజకీయంగా నరసరావుపేటకి నెల్లూరుకి అవినాభావసంబంధం ఉన్నట్టు ఉందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. 1999 ఎన్నికల్లో నెల్లూరు జిల్లా నుంచి వచ్చి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిని పల్నాడు ప్రాంత వాసులు గెలిపించారు. తరువాత ఎన్నికల్లో అదే నెల్లూరు నుంచి వచ్చి కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో నిలిచిన మేకపాటి రాజమోహన్‌రెడ్డిని నరసరావుపేట పార్లమెంట్ ఓటర్లు 86,255 ఓట్ల భారీ మెజార్టీతో గెలిపించారు. ఇలా ఇప్పటివరకు నెల్లూరు నుంచి వచ్చి పోటీ చేసిన నేతలకు నరసరావుపేట ఓటర్లు బ్రహ్మరథం పట్టారు. త్వరలో జరగనున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ నెల్లూరు జిల్లా వాసి మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ వైఎస్సార్‌సీపీ తరఫున పోటీలో ఉంటున్నారు. దీంతో మరోసారి నెల్లూరు సెంటిమెంట్ పనిచేసి అనిల్‌కుమార్ యాదవ్ గెలుపు పక్కా అని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

అయోమయంలో టీడీపీ నేతలు



సోమవారం జరిగిన నంబూరు శంకరరావు నామినేషన్‌కు తరలి వచ్చిన జనప్రవాహం

- వైఎస్సార్ సీపీ అభ్యర్థి నంబూరు వారి నామినేషన్‌కు సూపర్ సక్సెస్
- టీడీపీ అభ్యర్థి నామినేషన్‌కు జనాన్ని తరలించేందుకు తిప్పలు

అచ్చంపేట: పెదకూరపాడు నియోజకవర్గంలో టీడీపీ నేతలు అయోమయంలో పడ్డారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి నంబూరు శంకరరావు నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుంచి 40వేల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో తరలిరావడం గమనార్హం. 25న జరిగే తమ అభ్యర్థి నామినేషన్‌కు ఇందులో సగమైనా రప్పించుకోగలమా అనే మీమాంసలో టీడీపీ నేతలు పడ్డారు. జనాన్ని రప్పించుకోవాలంటే ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

కన్నాను ఆశ్రయించిన భాష్యం

వైఎస్సార్ సీపీ అభ్యర్థి నంబూరు నామినేషన్ కార్యక్రమానికి హాజరైన జనన్నా చూసి బిత్తరపోయిన టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను ఆశ్రయించాడు. టికెట్ ఆశించి భంగపడ్డ కొమ్మాలపాటి వర్గం అంటీముట్టనట్లు వ్యవహరిస్తుండడంతో గతంలో ఇదే నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పనిచేసి ప్రస్తుతం సత్తెనపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. పాత పరిచయాలను వినియోగించి ఎలాగైన 25న జరిగే నామినేషన్‌కు జనసమీకరణ చేయాలని కోరడంతో కాదనలేక కన్నా లక్ష్మీనారాయణ తన పాత మిత్రులతో మాట్లాడేందుకు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పెదకూరపాడు నియోజకవర్గంలోనే గడిపారు. కానీ ఆయన వ్యూహం బెడిసికొట్టింది. అప్పటి కన్నా పరిచయస్తులంతా ప్రస్తుతం వైఎస్సార్ సీపీలో ఉండటంతో నిరాకరించినట్లు తెలుస్తోంది. సొంత సామాజికవర్గం వారు కూడా సున్నితంగా తిరస్కరించినట్లు తెలిసింది.

ప్రలోభాలతో గట్టెక్కే ప్రయత్నాలు

నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ప్రభంజనం రోజురోజుకు పెరుగుతుండడంతో కరుడు కట్టిన టీడీపీ వాదులు కూడా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. టీడీపీకి అనుకూల గ్రామాలలో వైఎస్సార్ సీపీ పాగా వేసింది. కులాలకతీతంగా సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి మద్దతిస్తున్నారు. వారి మనస్సు మార్చడం టీడీపీ నాయకుల వల్ల కావడంలేదు. ఇక ఏం చేయలో అంతుబట్టని టీడీపీ అభ్యర్థి ప్రలోభాలకు తెరలేపారు. స్థాయిని బట్టి ఎరవేసే ప్రయత్నాలు మొదలుపెట్టారు. వార్డు స్థాయి అయితే ఒక రేటు, గ్రామ స్థాయి అయితే మరో రేటు, అదే మండల స్థాయి అయితే ఇంకొక రేటులతోపాటు భవిష్యత్‌లో పార్టీ పదవులను కూడా ఎర చూపిస్తున్నారు. సర్పంచ్, ఎంపీటీసీలను తమ పార్టీలో చేరాలంటూ ఆశ చూపిస్తున్నారు. కొంతమంది తిరిగి వైఎస్సార్ సీపీలోకి వస్తున్నారు. మీరు మాకు పదవులు ఇవ్వాలంటే ముందు అధికారంలోకి వస్తేనే కదా అని కొంత మంది బాహాటంగానే అడుగుతున్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావును ఎదుర్కొనేందుకు పన్నే వ్యూహాలన్నీ బెడిసికొట్టడంతో ఏం చేయాలో దిక్కు తోచక టీడీపీ అభ్యర్థి అయోమయంలో పడ్డారు.

జెడ్పీ సర్వసభ్య సమావేశం నిరవధిక వాయిదా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిరవధికంగా వాయిదా పడింది. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సాధారణ సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతి మూడు నెలలకోసారి జెడ్పీ సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉంది. కాగా ఎలక్షన్ కోడ్ కారణంగా జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి నుంచి అనుమతి పొంది, సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2.00 గంటలకు జరగాల్సిన సమావేశంలో 3.15 గంటల వరకు సభ్యులు పెద్దగా హాజరు కాలేదు. మొత్తం 54 మంది సభ్యుల్లో 10 మంది హాజరయ్యారు. దీంతో గంటపాటు సమావేశాన్ని వాయిదా వేసిన హెనీ క్రిస్టినా తిరిగి సాయంత్రం 4.15 గంటలకు సభ్యుల హాజరును లెక్కించారు. 54 మంది జెడ్పీటీసీలతోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలను కలుపుకుని మొత్తం 86 మంది సభ్యులకుగాను మూడో వంతులో కనీసం 29 మంది హాజరు కావాల్సి ఉండగా, హెనీ క్రిస్టినాతో సహా 11 మంది ఉన్నారు. దీంతో కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఆమె ప్రకటించారు.

నేరాలన్నీ అకస్మాత్తు సంఘటనలే

- పక్కా ప్రణాళికతో ఎవరూ నేరాలకు పాల్పడలేదు
- మొత్తం 17 నేరాల్లో 14లో వెంటనే చర్యలు
- మూడు కేసుల్లో ప్రత్యక్ష సాక్షులు లేక ఆలస్యం
- అత్యవసరమైతే 94407 96184 కాల్ చేయండి
- విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీలు వెల్లడి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎస్పీ బిందుమాధవ్, పక్కన ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

నరసరావుపేట: జిల్లాలో ఎన్నికల వాతావరణం మొదలైన తర్వాత జరిగిన సంఘటనలు అకస్మాత్తుగా జరిగాయే కానీ ఏదీ పక్కా ప్రణాళికతో జరగలేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్, జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ పేర్కొన్నారు. అవి జరగటానికి మద్యం కూడా ఒక కారణమని చెప్పారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ మే 13న జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా పోలింగ్ నిర్వహించేందుకు జిల్లా ఎస్పీతో కలిసి చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు చేసేందుకు అబ్జర్వర్లు, చెక్‌పోస్టులు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయన్నారు. గతంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. వాటిని దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటివరకు 17కేసులు నమోదు అయ్యాయన్నారు. కారంపూడిలో ఒకటి, మాచర్లలో రెండు, గురజాల సబ్‌డివిజన్, సత్తెనపల్లి సబ్‌డివిజన్ పరిధిలో కేసులు నమోదయ్యాయన్నారు. ప్రతి కేసులో పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదుచేసి లభించిన సాక్ష్యాలతో అరెస్టులు, స్టేషన్ బెయిల్స్, 41ఏ నోటీసులు ఇచ్చారని తెలిపారు. జిల్లాలో చిన్న సంఘటనలు జరిగినా మీడియాలో జిల్లా మొత్తం ఘర్షణలు, విధ్వంసాలు జరుగుతున్నట్లు చూపిస్తున్నారన్నారు. జిల్లాలో 542 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, 15 వల్నరబుల్ స్టేషన్లలో పూర్తిగా నిఘా ఏర్పాటు చేశామన్నారు. గత ఆదివారం వెల్దుర్తి, మండాదిలో జరిగిన ఘటనల ప్రదేశాలను పరిశీలించి పెద్దలతో మాట్లాడామన్నారు. మండాదిలో రాత్రి నిద్ర చేశామన్నారు. ఏదైనా సంఘటన జరిగే అవకాశాలు ఉంటే ఆర్వో, ఏఆర్వో, పోలీసులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. శాంతిభద్రతల విషయంలో కేంద్ర బలగాల సహాయం తీసుకుంటున్నామన్నారు. యువత ఎక్కడా నేరాలలో పాలుపంచుకోకుండా ఉండాలని సూచించారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ జిల్లాలో ఎప్పుడు సంఘటన జరిగినా వెంటనే చట్ట పరిధిలో తీసుకోవాల్సిన చర్యలకు పోలీసులు వెనుకాడట్లేదన్నారు. 17 కేసులు నమోదు కాగా మూడు కేసుల్లో రెండు పార్టీ కార్యాలయాలు తగులబడటం, ఒకటి ట్రాక్టర్‌లో గడ్డి తగులబడటం జరిగాయని, వీటిలో ప్రత్యక్ష సాక్షులు లభించలేదన్నారు. దీని వలన ఈ కేసుల్లో చర్యలు ఆలస్యమౌతున్నాయన్నారు. మిగిలిన కేసుల్లో వెంటనే చర్యలు తీసుకున్నామని తెలిపారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నారన్నారు. దుర్గి, మాచర్ల, వెల్దుర్తి, అమరావతి ప్రాంతాల్లో తాను పర్యటించానన్నారు. కొన్ని సమస్యాత్మక గ్రామాలలో పర్యటించి గ్రామస్తులకు ధైర్యం కల్పించామన్నారు. ప్రతి రోజూ 20 నుంచి 30 గ్రామాల్లో కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏదైనా సంఘటన జరిగేలా ఉంటే వెంటనే తమకు 94407 96184 ఫోన్‌కాల్ చేయాలని సూచించారు. రాత్రి, పగలు పోలీసులు విధులు నిర్వహిస్తూ నేరాలు జరగకుండా అరికడుతున్నారన్నారు. పోలింగ్‌కు బందోబస్తు ప్లాన్ చేశామని, గతంలో సంఘటనలు జరిగిన ప్రదేశాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులకు తెలియచేస్తే వాటిని పరిష్కరించి శాంతి భద్రతలు కాపాడతామని తెలిపారు.

యార్డులో 84,371 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 75,351 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 84,371 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 17,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 20,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 51,569 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

జిల్లాలో 34 నామినేషన్లు దాఖలు

ఐదో రోజు అత్యధికంగా ఇండిపెండెంట్లు నామినేషన్

నరసరావుపేట: జిల్లా వ్యాప్తంగా ఐదో రోజైన మంగళవారం 34మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. వీటిలో ఐదుగురు పార్లమెంటుకు దాఖలు చేయగా 29మంది వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్లు వేశారు. వారిలో అత్యధికంగా 16మంది ఇండిపెండెంట్లు ఉండగా, ప్రధాన పార్టీలైన వైఎస్సార్ సీపీ నుంచి ఒకటి, టీడీపీ నుంచి నలుగురు నామినేషన్లు దాఖలు చేశారు. పార్లమెంటు అభ్యర్థులుగా షేక్ అబ్దుల్ రజాక్ మూడోసెట్ నామినేషన్(ఇండిపెండెంట్) దాఖలు చేశారు. గర్నేపూడి అలెగ్జాండర్ సుధాకర్(ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), గనిపల్లి భూషణం(ఇండియా ప్రజాబంధు), కూచిపూడి జాన్‌బాబు(జైభీమ్‌రావు భారత్), షేక్ నజ్మా (ఇండిపెండెంట్) నామినేషన్ వేశారు. పెదకూరపాడు అసెంబ్లీకి ఆలా రామకృష్ణారావు(భారత చైతన్య యోజన), పరగటి రాజు, కంచేటి సాయిబాబు(ఇండిపెండెంట్), చిలకలూరిపేట అసెంబ్లీకి ప్రత్తిపాటి శరత్, ప్రత్తిపాటి పుల్లారావు (టీడీపీ), పఠాన్ రెహతాన్(ఇండిపెండెంట్), మురళీ రామకోటేశ్వరరావు(ఇండియన్ లేబర్ పార్టీ), నరసరావుపేట అసెంబ్లీకి చదలవాడ అరవిందబాబుకు మద్దతుగా కొర్రపాటి శ్రీనివాసరావు, చదలవాడ ఆదిత్యకు మద్దతుగా తాడికొండ ఆదిత్య (టీడీపీ), గోదా జాన్‌పాల్ (జైభీమ్‌రావు భారత్), షేక్ మహబూబ్ బాష (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), సత్తెనపల్లి అసెంబ్లీకి అంబటి రాంబాబుకు మద్దతుగా కల్లమ్ విజయభాస్కరరెడ్డి(వైఎస్సార్‌సీపీ), సులమ్ రాజ్యలక్ష్మి, మేకల వేణుమాధవరెడ్డి, కందుకూరి జక్రయ్య, బొర్రా వెంకటఅప్పారావు, షేక్ దరియావలి(ఇండిపెండెంట్), గోదా వెంకటరమణ(జాతీయ జనసేన పార్టీ), పేరుపోగు నవీన్‌బాబు (బీఎస్పీ) నామినేషన్లు వేశారు. వినుకొండ అసెంబ్లీకి ఉస్తల చినకాశయ్య, షేక్ బాజి, నార్లశెట్టి శ్రీనివాసరావు, బచ్చు వెంకట రవికుమార్(ఇండిపెండెంట్లు), చిరంజీవి నాయక్(జైభారత్‌నేషనల్ పార్టీ), చెన్నా శ్రీనివాసరావు(ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), గురజాల అసెంబ్లీకి నాగెండ్ల యోబు(బహుజన సమాజ్‌పార్టీ), కనకం శ్రీనివాసరావు(నేషనల్ నవక్రాంతి పార్టీ), మాచర్ల అసెంబ్లీకి కుందురు వీరాంజనేయరెడ్డి, గొల్లా శ్రీనివాసరావు (ఇండిపెండెంట్లు)గా నామినేషన్లు వేశారు.

క్లుప్తంగా

పేటలో నాలుగు నామినేషన్లు

చిలకలూరిపేట : నామినేషన్ల ఐదో రోజైన మంగళవారం చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ అభ్యర్థిగా ప్రత్తిపాటి పుల్లారావు నామినేషన్ దాఖలు చేయగా, ఆయన కుమారుడు ప్రత్తిపాటి శరత్ కూడా నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా పఠాన్ రహమతున్ ఒక నామినేషన్ వేశారు. ఇండియన్ లేబర్ పార్టీ అభ్యర్థిగా మూకిరి రామ కోటేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు.

సీఐ,ఎస్ఐ, ఏఎస్ఐ లకు షోకాజ్ నోటీసులు

సత్తెనపల్లి : సార్వత్రిక ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్ దాఖలుకు సోమవారం రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు ఒక కారుకు అనుమతించారనే నేపథ్యంలో విధులు నిర్వహిస్తున్న సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాజేష్ కుమార్, పట్టణ ఎస్ఐ ఎం.సత్యనారాయణ, ఏఎస్ఐ పి.వెంకటేశ్వర్లుకు మంగళవారం రిటర్నింగ్ అధికారి వి.మురళీకృష్ణ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న 24 గంటల్లో సమాధానం పంపాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఏఎంజీ విద్యార్థి



చిలకలూరిపేట: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ అండర్ -19 పోటీలు ఇటీవల విజయవాడలోని మేరీ స్టెల్లాస్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ పోటీ స్థానిక ఏఎంజీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న గుంజి మనోజ్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విద్యార్థి హర్యానాలో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటాడు. ఈ విద్యార్థికి ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

వెలవెల బోయిన షర్మిల సభ



తెనాలిరూరల్: తెనాలిలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నిర్వహించిన బహిరంగ సభ వెలవెల బోయింది. ఇండియా కూటమి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఇక్కడి పురవేదిక వద్ద బహిరంగ సభ నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకే సభ అని ప్రచారం చేశారు. రాత్రి 8.33 గంటలకు ఆమె వేదికపైకి వచ్చారు. అప్పటికే సమీకరించిన జనంలో సగం మంది వరకు వెళ్లిపోయారు. ఇక షర్మిల ప్రసంగించే సమయంలోనూ ప్రజలు వెళ్లిపోయారు.

అడ్డం తిరిగిన అరవింద్‌బాబు

- బీ-ఫారంతోపాటు డబ్బులు ఇస్తేనే పోటీ చేస్తానని షరతు
- ఒప్పందం ప్రకారం డబ్బులు డిపాజిట్ చేయని వైనం
- అందువల్లే నరసరావుపేట అభ్యర్థికి ఇంకా బీ-ఫారం ఇవ్వని టీడీపీ?
- బీ-ఫారం లేకుండానే నామినేషన్ దాఖలు చేసిన అరవింద్‌బాబు
- ఓ ఎమ్మెల్సీ వద్ద నరసరావుపేట బీ-ఫారం ఉన్నట్లు ప్రచారం



చదలవాడ అరవింద్‌బాబు కుమారుడును అడ్డగిస్తున్న వడ్డెర సంఘు నాయకులు (ఫైల్ ఫొటో)

సాక్షి, నరసరావుపేట : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పల్నాడు జిల్లా నరసరావుపేట టీడీపీ అభ్యర్థి చదలవాడ అరవింద్‌బాబు అడ్డం తిరిగారు. తాను పార్టీకి డబ్బులు ఇవ్వడం కాదు. తనకు పార్టీ బీ-ఫారంతోపాటు డబ్బులు కూడా ఇవ్వాలని కండిషన్ పెట్టినట్లు సమాచారం. దీంతో ఖంగుతిన్న టీడీపీ అధిష్టానం ఆయనకు బీ-ఫారం ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టింది. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం అరవింద్‌బాబు డబ్బులు డిపాజిట్ చేస్తేనే ఆయనకు బీ-ఫారం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. అయినా అరవింద్‌బాబు లెక్క చేయకుండా బీ-ఫారం లేకుండానే ఈ నెల 18న నామినేషన్ దాఖలు చేశారు.

ఓటమి భయంతోనే

తనను అభ్యర్థిగా ప్రకటించడానికి ముందు చేసుకున్న ఒప్పందం ప్రకారం అరవింద్‌బాబు టీడీపీ అధిష్టానికి రూ.30 కోట్లు డిపాజిట్ చేయాల్సి ఉందని సమాచారం. అయితే వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో ఉన్న ఆదరణతో మరోసారి ఇక్కడ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గెలుపు ఖాయమని ప్రచారం జరుగుతోంది. టీడీపీలోని ఓ ప్రధాన సామాజికవర్గం కూడా అరవింద్‌బాబుకు సహకరించడం లేదు. అదే సమయంలో ఇటీవల పట్టణంలోని 24వ వార్డులో వడ్డెర సామాజికవర్గ నేతలు అరవింద్ బాబు కుమారుడిని తమ వార్డులోకి రావద్దని అడ్డుకున్నారు. అటు టీడీపీలో ముఖ్య సామాజికవర్గం సహకరించక, ఇటు బీసీలు ఆదరించక తాను ఎలా గెలవడమని అరవింద్‌బాబు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఓడిపోయే సీటుకు రూ.కోట్లు ఎందుకు ఖర్చు చేసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. అందువల్లే ఆయన కావాలనే డబ్బుల్లేవని డ్రామాలు ఆడుతున్నారని టీడీపీ నేతలే ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం టీడీపీ అభ్యర్థులందరికి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో బీ-ఫారాలు అందించారు. అయితే అరవింద్‌బాబు ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం నరసరావుపేటకు చెందిన టీడీపీలోని ఓ ముఖ్య నేతకు రూ.30 కోట్లు ఇవ్వగానే బీ-ఫారం అందజేసేలా అధిష్టానం ఏర్పాట్లు చేసింది.

డబ్బులు ఇస్తేనే పోటీలో ఉంటా?



అరవింద్‌బాబు పంచాయితీని ఓ ఎమ్మెల్సీ, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలుకు చంద్రబాబు అప్పగించారు. దీంతో ఇటీవల వారి మధ్య చర్చల సందర్భంగా ఇప్పటికే పార్టీ కోసం రూ.కోట్లు ఖర్చు చేశానని, ఇప్పుడు రూపాయి కూడా ఖర్చు చేసే పరిస్థితిలో తాను లేనని అరవింద్ బాబు తేల్చిచెప్పినట్లు సమాచారం. బి.ఫారంతోపాటు ఖర్చులకు డబ్బులు ఇస్తేనే పోటీలో ఉంటానని, లేకపోతే మరో అభ్యర్థిని చూసుకోవాలని ఆయన స్పష్టం చేసినట్లు తెలిసింది. మరోవైపు ఎన్నికల నామినేషన్ల దాఖలుకు గడువు గురువారం మధ్యాహ్నం మూడు గంటలతో ముగియనుంది. అయినా అరవింద్ బాబు పంచాయితీ తేలకపోవడంతో టీడీపీ కార్యకర్తలు గందరగోళానికి గురవుతున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన 40 కుటుంబాలు



పార్టీలో చేరిన వారి మధ్య కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి వారి ద్వారా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందచేయడం ద్వారా ఆకర్షితులైన టీడీపీకి చెందిన వ్యక్తులు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మూడోవార్డు పరిధిలోని కుమ్మరిబజారులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతానికి చెందిన బెజ్జంకి బాజి, మల్లి, పవన్, చల్లా కాశి, టి.శ్రీనివాసరావుతో కలిసి 40 కుటుంబాలకు చెందిన వ్యక్తులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సిద్ధం పేరుతో తయారుచేసిన కేకును కట్ చేశారు. గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యే గోపిరెడ్డిని గెలిపించుకుంటామని వారు ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. ఒక్క నెల వలంటీర్లను విధులకు హాజరుకాకుండా ఆపితే పింఛన్లు తీసుకునే వారు చాలా ఇబ్బంది పడ్డారన్నారు. గతంలో జన్మభూమి కమిటీలకు చెందిన వ్యక్తులు చెప్పిన వారికే పథకాలు అందచేశారని, బీసీలకు సీఎం జగన్ చాలా ప్రాముఖ్యత ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, సయ్యద్ ఖాజా మొహిద్దీన్, శిలార్, షేక్ మీరావలి, షేక్ రఫీ, మున్నా, చేయూత గౌస్ పాల్గొన్నారు.

సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టి

పల్నాడు జిల్లా ఎస్పీ బిందు మాధవ్



రెంటాల పోలింగ్ బూత్లను పరిశీలించి పలు సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పీ బిందు మాధవ్

రెంటచింతల : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో వారి ఓటు హక్కును వినియోగించుకోవడంలో భాగంగా నియోజక వర్గంలోని సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పల్నాడు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని రెంటాల, మంచికల్లు, పాలువాయి, తుమ్మకోట, మిట్టగుడిపాడు గ్రామాలలోని పోలింగ్ బూత్‌లను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించి మాట్లాడారు. రెంటాల గ్రామంలో గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. గ్రామస్తులతో మాట్లాడుతూ ప్రతి చిన్న విషయానికి గొడవలు పడవద్దని, ఎవరి ఓటు వారు ప్రశాంతంగా వేసుకోవాలన్నారు. పోలీసుల దృష్టిలో అందరూ సమానమేనని గుర్తుంచుకోవాలని, ఓటర్లకు రక్షణ కల్పించడమే మా లక్ష్యమన్నారు. సున్నితమైన పోలింగ్ బూత్‌లను గుర్తించి అక్కడ ఎక్కువ మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తును ఇచ్చితంగా ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలు ధైర్యంగా వారి ఓటు వేసుకునేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఎక్కడైతే పోలింగ్ స్టేషన్ల వద్ద అత్యంత సంక్లిష్ట పరిస్థితులు ఉన్నాయో అక్కడ సిఐఎఫ్, సీఆర్పీ వంటి ప్రత్యేక దళాలతో భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఓటర్లను ప్రలోభాలకు, భయందోళనకు గురిచేసినా, వారి ఓటు హక్కుకు భంగం కలిగించినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వేసుకునే పరిస్థితి కల్పించడానికి ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. నియోజకవర్గంలో మొత్తం 299 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని వాటిలో 140 పోలింగ్ బూత్‌లు సమస్యాత్మకమైనవిగా గుర్తించడం జరిగిందన్నారు. వారి వెంట గురజాల డీఎస్పీ పల్లపురాజు, ట్రైనీ డీఎస్పీ హేమంత్, స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ కె. వెంకట నారాయణరెడ్డి తదితరులున్నారు.

ఘనంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం



వేడుకలను ప్రారంభిస్తున్న మస్తానయ్య, భూసరపల్లి వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం- 2024 వేడుకలను బృందావన్‌గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవస్థాన ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. రామరాజు లక్ష్మీ శ్రీనివాసరావు దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం కోల్‌కొత్తాకు చెందిన ఆత్రేయి దత్త ఒడిస్సీ, బెంగాల్‌కు చెందిన సందీప్ కుందు కూచిపూడి, గరిణి సాయికుమార్, సంతోష్ కుమార్ పేరిణి శివతాండవాన్ని ప్రేక్షక జన రంజకంగా ప్రదర్శించారు. వారం రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈసందర్భంగా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ కాజ వేంకట సుబ్రహ్మణ్యం కళాకారులను నృత్య శిరోమణి, యువ కళారత్న బిరుదులతో సత్కరించారు. కార్యక్రమాలను సంస్థ కోశాధికారి నాగలక్ష్మి, తాళ్లూరి ధరణి పర్యవేక్షించారు.

వీఐటీ-ఏపీ వర్సిటీకి ప్రతిష్టాత్మక పురస్కారం

- సీఎస్ఆర్ అవుట్ స్టాండింగ్ యూనివర్సిటీ ఇన్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి



అవార్డు అందుకుంటున్న వీసీ డాక్టర్ కోటారెడ్డి

తాడికొండ: వీఐటీ- ఏపీ విశ్వవిద్యాలయం 2024 ఏడాదికి గానూ ప్రతిష్టాత్మక సీఎస్ఆర్ అవుట్ స్టాండింగ్ యూనివర్సిటీ ఇన్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నట్లు వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి తెలిపారు. 2024 ఏడాదికి ఈ అవార్డును అందుకోవడం వర్సిటీ ఖ్యాతిని ఇనుమడింపజేసిందన్నారు. భారతదేశంలో 60 ఏళ్లకు పైగా ప్రచురణ రంగంలో ఉన్న కాంపిటీషన్ సక్సెస్ రివ్యూ, విద్యాపరమైన నైపుణ్యం, సమగ్ర అభివృద్ధికి వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఈ అవార్డు అందించడం జరిగిందన్నారు. వర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది, రీసెర్చ్ స్కాలర్స్ మరియు విద్యార్థుల అకడమిక్ ఎక్సలెన్స్, సామాజిక పురోగతి పట్ల అచంచలమైన అంకిత భావానికి నిదర్శనమన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర మాట్లాడుతూ తమ వర్సిటీ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడానికి కట్టుబడి ఉందన్నారు.

నేటి నుంచి ఏఎన్‌యూలో నాక్ బృందం పర్యటన

ఏఎన్‌యూ: నాక్(నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) పీర్ కమిటీ బుధవారం నుంచి ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో పర్యటించనుంది. నాక్ సభ్యుల బృందం పర్యటన మూడు రోజుల పాటు కొనసాగనుంది. యూనివర్సిటీ సందర్శనలో భాగంగా ముందుగా నాక్ బృంద సభ్యులు యూనివర్సిటీ ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు. వీసీ ఆచార్య పి.రాజశేఖర్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా యూనివర్సిటీ సమగ్రాభివృద్ధిని కమిటీకి వివరిస్తారు. అనంతరం యూనివర్సిటీ ఐక్యూఏసీ నివేదికను కమిటీకి సమర్పిస్తుంది. అనంతరం కమిటీ సభ్యులు బృందాలుగా వర్సిటీలోని అన్ని కార్యాలయాలు, విభాగాలను సందర్శించి వాటిలోని వసతులు, సేవలు, రికార్డులను పరిశీలిస్తారు. నాక్ పర్యటన సందర్భంగా యూనివర్సిటీ అధికారులు ఎనిమిది ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీల సభ్యులు నాక్ కమిటీ సభ్యులకు అవసరమైన సహకారం అందిస్తారు. ఈ మూడు రోజుల పర్యటనలో నాక్ సభ్యులు యూనివర్సిటీ అధ్యాపకులు, పరిశోధకులు, పూర్వ విద్యార్థులు, యూనివర్సిటీ విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడతారు. వారి నుంచి సమాచారం సేకరిస్తారు. యూనివర్సిటీలోని విద్య, పరిశోధన, బోధన, మౌలిక వసతులు, క్రీడా ప్రమాణాలు, యూనివర్సిటీ అందిస్తోన్న సేవలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాల ప్రామాణికంగా కమిటీ యూనివర్సిటీకి నాక్ గ్రేడ్‌ను ప్రతిపాదిస్తుంది. ఆ నివేదిక ఆధారంగా నాక్ సంస్థ యూనివర్సిటీకి గ్రేడ్‌ను జారీ చేస్తుంది.

మహిళల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్‌పర్సన్ ఉమా మహేశ్వరీ దేవి

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ పి.ఉమా మహేశ్వరీదేవి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల 82వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానాన్ని అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం కేంద్ర మార్గ దర్శకాలకు అనుగుణంగా మహిళా విద్యాభివృద్ధి దిశగా ప్రత్యేక చర్యలు చేపడుతోందని చెప్పారు. కళాశాల విద్య ఆర్జేడీ డాక్టర్ పి.కళావతి మాట్లాడుతూ ప్రతి మహిళ డిగ్రీ పట్టాతో పాటు ఉద్యోగాన్ని అందిపుచ్చుకునే విధంగా విద్యాశాఖ శిక్షణను అందిస్తోందని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రమాజ్యోత్స్న కుమారి మాట్లాడుతూ అటానమస్ హోదాతో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలగా 24 కోర్సులు నిర్వహిస్తూ, ప్రత్యేక శిక్షణ ద్వారా ఉద్యోగావకాశాలను సైతం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది నుంచి జాతీయ విద్యా ప్రణాళికలో కళాశాల చేరిందని, ఆరు కంప్యూటర్ కోర్సులకు గానూ 25 కంప్యూటర్లను సమకూర్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థినులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు, ఎండోమెంట్ నగదు పురస్కారాలు అతిథులచే అందించారు. కార్యక్రమంలో డాక్టర్ అబ్రహం లింకన్, స్టూడెంట్ కౌన్సిల్ కన్వీనర్ కె.సుబ్బరత్నమ్మ, కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ధాత్రి కుమారి, డాక్టర్ షాహిదా అక్తర్, అధ్యాపకులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో ఉమా మహేశ్వరీదేవి, ఆర్జేడీ కళావతి, ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి

మలేరియా నిర్మూలనకు కృషి చేద్దాం

డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయమ్మ

బాపట్ల: మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని డీఎం అండ్ హెచ్‌ఓ విజయమ్మ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కార్యాలయంలో మలేరియా నిర్మూలన కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మలేరియా నిర్మూలనకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రజలు దోమ తెరలు వాడాలని, దోమకాటు నుంచి రక్షణ పొందేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు టి.వెంకటేశ్వర్లు, వై.రాజకుమార్, షకీల్, జూగుంట రాంబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి ఆర్యవైశ్యుల సంపూర్ణ మద్దతు

- ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్
- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు విజయానికి సహకారం
- క్రోసూరులో ఆర్యవైశ్య ప్రముఖుల సమావేశంలో తీర్మానం



క్రోసూరులో గుబ్బా చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

క్రోసూరు: ఆర్య వైశ్యులంతా వైఎస్సార్ సీపీకి సంపూర్ణ మద్దతును ప్రకటించారని ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఆర్యవైశ్య నాయకులు గుబ్బా చంద్రశేఖర్ వెల్లడించారు. మంగళవారం క్రోసూరు వచ్చిన ఆయన స్థానిక ఆర్యవైశ్య ప్రముఖులతో సమావేశమయ్యారు. ఆర్యవైశ్యులంతా ఏకగ్రీవంగా వైఎస్సార్ సీపీకి సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్నారని, ఆర్య వైశ్యులకు సముచిత స్థానం కల్పించి వ్యాపారులకు అన్ని విధాలా సహకారం అందించటం జరిగిందన్నారు. జగనన్న సంక్షేమ పథకాలు అనేక మంది పేద ఆర్య వైశ్యులకు అందుతున్నాయని అన్నారు. ఈ కారణంగా ఆర్య వైశ్యులంతా వైఎస్సార్ సీపీకి సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు చెప్పారు. ప్రతి ఒక్క ఆర్య వైశ్య కుటుంబం వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకోవటమే లక్ష్యంగా ఉండాలన్నారు.

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, పార్లమెంట్ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్‌కు ఓట్లు వేసి అధిక మెజారిటీతో గెలుపొందేందుకు సహకరించాలన్నారు. ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేయాలన్నారు. ఈ సందర్భంగా ముందుగా క్రోసూరులో ఇటీవల నూతనంగా పునఃప్రతిష్ట గావించిన వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. గుబ్బా చంద్రశేఖర్‌ను కలుసుకున్న వారిలో ఆర్యవైశ్య సంఘం పూర్వ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మీ శివన్నారాయణ, ఆర్యవైశ్య సంఘం పూర్వ సెక్రటరీ కట్టమూరి అప్పారావు, కూనల శ్రీనివాసరావు, తొమ్మండ్రు నాగేశ్వరరావు, ఏలూరి ఆదినారాయణ, కోట ప్రభాకరరావు, కోట భాస్కర్, కూనల రవితేజ, కంభంపాటి రామ్మోహనరావు, దేవరశెట్టి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘ అధ్యక్షురాలిగా భవానీ దేవి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘ నూతన అధ్యక్షురాలిగా ప్రముఖ రచయిత్రి డాక్టర్ సి.భవానీదేవి, గౌరవాధ్యక్షులుగా డాక్టర్ పాపినేని శివశంకర్ ఎన్నికయ్యారు. బృందావన్‌గార్డెన్స్‌లోని అన్నమయ్య గ్రంథాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతేడాది సంఘ అధ్యక్షుడు సోమేపల్లి వెంకట సుబ్బయ్య ఆకస్మిక మరణంతో ఆయన స్థానంలో భవానీదేవి ఎన్నికయ్యారు. బాపట్లకు చెందిన భవానీదేవి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సచివాలయ ముఖ్య కార్యదర్శిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. కవయిత్రిగా, కథా, నవల, వ్యాసరచయిత్రిగా, కాలమిస్టుగా, పలు భాషల అనువాదకురాలిగా ఆమె తెలుగు సాహిత్య రంగంలో తనదైన బహుముఖీనమైన సేవలు అందించారు. ప్రస్తుత ఏడాది సాహితీ స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న వేళ భవానీదేవి రచయితల సంఘ నూతన అధ్యక్షురాలిగా ఎన్నిక కావడం విశేషం. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, కోశాధికారి నానా, ఉపాధ్యక్షులు డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, బొమ్ము ఉమా మహేశ్వర రెడ్డి, కార్యదర్శులు ఎస్.ఎం.సుభాని, సీహెచ్ శర్మ, డాక్టర్ ఎం.లలితకుమారి పాల్గొన్నారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

చుండూరు(వేమూరు): కాల్వలో పడి కాజా రామకృష్ణ(30) అనే వ్యక్తి మృతి చెందిన ఘటన నడిగడ్డవారిపాలెంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చుండూరు మండలం నడిగడ్డవారిపాలేనికి చెందిన కాజా రామకృష్ణ సోమవారం తెలుగు దేశం పార్టీ వేమూరు అభ్యర్థి నక్కా ఆనంద్‌బాబు నామినేషన్ కార్యక్రమానికి వెళ్లాడు. అక్కడ టీడీపీ నాయకులు పంపిణీ చేసిన మద్యం సేవించి, సాయంత్రం ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో స్థానికంగా ఉన్న కాల్వ వద్దకు మూత్ర విసర్జనకు వెళ్లగా.. కాలు జారి అందులో పడిపోయి మృతి చెందాడని తెలిపారు. పోలీసులకు సమాచారం తెలియజేయడంతో కాల్వలో ఉన్న మృతదేహాన్ని.. తెనాలి ప్రభుత్వ వైద్య శాలకు తరలించినట్లు ఎస్ఐ మహ్మద్ రఫీ తెలిపారు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చెప్పారు.

ఎస్సై నాగశివారెడ్డికి షోకాజ్ నోటీసులు

పర్చూరు (చినగంజాం): పర్చూరు తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం విధులలో ఉన్న ఎస్సై నాగ శివారెడ్డి టీడీపీ కార్యకర్తలను దూషించిన విషయమై ఎస్పీ వకుల్ జిందాల్ షో కాజ్ నోటీసులు జారీ చేశారు. పర్చూరు తహసీల్దారు కార్యాలయం మెయిన్ గేటు వద్ద విధి నిర్వహణలో ఉన్న ఎస్సై నాగ శివారెడ్డి టీడీపీ కార్యకర్తలను అసభ్యకర పదజాలంతో దూషించాడని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్వయంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఎస్సై నాగశివారెడ్డిని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి పిలిపించి, సదరు విషయమై వివరణ కోరారు. అనంతరం ఎస్సైకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. విచారణ అధికారిగా బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణను నియమించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద బందోబస్తు విధులు నిర్వహిస్తున్న నాగశివారెడ్డిని అన్నంబొట్లవారిపాలెం చెక్ పోస్ట్ విధులకు ఎస్పీ పంపించారు.

ఐదో రోజు నాలుగు నామినేషన్లు

చీరాల టౌన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మంగళవారం ఐదవ రోజు నాలుగు నామినేషన్లు దాఖలు అయినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ తరపున రెండో సెట్ నామినేషన్ అందించారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా పఠాన్ కాలేషా, జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ తరపున శీలం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమంచి కృష్ణమోహన్ తమ నామినేషన్లు ఆర్వోకు అందజేశారు.